# తప్పు

ఆఫీసు నుంచి రాగానే కమల వద్ద నుంచి వచ్చిన ఉత్తరం ఇచ్చింది అమ్మ. ఒకే ఒక్క నిమిషంలో అది చదవడం పూర్తిచేసాను.

"ఏమిటి విషయం?..." ఎప్పటిలాగే అడిగింది అమ్మ.

"ఏముంది, మామూలే... ఒక్కసారి వచ్చి వెళ్ళమంటుంది!"

"మరి ఎప్పుడు వెళ్తున్నావు?"

"అసలు వెళ్ళాలా – వద్దా అన్నది నేనింకా నిశ్చయించుకోలేదమ్మా!" అన్నాను చిరాకుగా.

"ఇదేమాట ఆరునెలల నుంచి చెబుతూనే ఉన్నావు. ఇంకా ఎప్పటికి నిశ్చయించుకుంటావురా?" కోపంగా అంది అమ్మ.

"ఔనన్నయ్యా! నువ్వు రాలేదని, తను రాసిన ఉత్తరాలకు సమాధానం రాయడం లేదనీ



మొన్న నేను వెళ్ళినప్పుడు కమలొదిన చాలా బాధపడింది. ఒకసారి వెళ్తే బాగుంటుంది కదా!" అంది టీ కప్పు చేతికిస్తూ చెల్లాయి.

నేను మాట్లాడకుండా టీ తాగడం మొదలు పెట్టాను... కమల దగ్గర్నుంచి ఉత్తరం వచ్చిందంటే చాలు... వీళ్లకిదే గొడవ! నాన్న దేవాలయానికి వెళ్ళినట్టున్నారు. లేకపోతే ఆయనా ఈసరికి నన్నేదో ఒకటి అని ఉండేవారు.

"కాస్త గట్టిగా అడిగితే మాట్లాడవు – లేదా – బయటకు వెళ్ళిపోతావే తప్ప అసలు కారణమేమిటో చెప్పవు. కమలా, నువ్వూ ఏమైనా గొడవపడ్డారా?" అంది అమ్మ.

టీ తాగేసి నేను స్నానాల గదివైపు కదిలాను... అమ్మ ఏదో సణుక్కుంటూ... "స్నానం చేసి తొందరగా రా... నన్నోసారి పెద్దాసుపత్రికి తీసికెళ్ళాలి!" అంది.

"ఆస్పత్రికా! ఏమైంది?"

"నువ్వేం కంగారు పడకు. నాకేం కాలేదు గానీ, పక్కింటి వారమ్మాయికి నెలలు నిండాయి. నొప్పులొస్తూంటే మధ్యాహ్నం ఆస్పత్రికి తీసికెళ్ళారు. ఇంతవరకూ ఏ కబురూ తెలియ లేదు. ఓమారు చూసి రావాలి" అంది అమ్మ.

పది నిమిషాల్లో స్నానం ముగించుకొచ్చాను. అప్పటికే అమ్మ సిద్ధంగా ఉంది. నేను బట్టలు వేసుకొని స్కూటర్ బయటకు తీసి స్టార్ట్ చేశాను. మేము ఆస్పత్రి కెళ్ళేసరికి పావు తక్కువ ఆరయింది.

అమ్మ స్కూటర్ దిగి "ఆ అమ్మాయికి ప్రసవమైందో లేదో తెలుసుకొని వచ్చేస్తానురా... నువ్విక్కడే ఉండు". అంటూ పురుళ్ళ వార్డులోకి నడిచింది.

ఆస్పత్రిలోకెళ్లడానికి ఇంకెంతో సమయం లేకపోవడంతో ఆటోల మీదా, స్కూటర్ల మీదా వస్తున్న జనం ఆదరా బాదరా రోగుల్ని చూడ్డానికెళుతున్నారు. అప్పటికే చూసి వస్తున్న వాళ్ళు నెమ్మదిగా బయటకు పోతున్నారు.

"హలో సతీష్! ఏమిటీ ఇక్కడున్నావ్?" వెళ్ళిపోతున్నవాడల్లా నన్ను చూసి, స్కూటరాపి అడిగాడు నా సహోద్యోగి కనకారావు.

అక్కడెందుకున్నానో చెప్పి– "మీ వాళ్ళెవరయినా ఆస్పత్రిలో ఉన్నారా?" అన్నాను.

"తెలిసిన వాళ్ళమ్మాయిలే...వరకట్నం కేసు... నిలువెల్లా కాలిపోయింది. పాపం! ఆ అమ్మాయిని చూస్తూంటే జీవితం మీద విరక్తి కలుగుతోంది!" బాధపడుతూ అని, "వస్తాను బ్రదర్... రేపు కలుద్దాం!" అంటూ వెళ్ళిపోయాడు కనకారావు.

నాకూ చాలా బాధనిపించింది. అదేం చిత్రమో... వరకట్నం కారణంగా మహిళలు ఏదోఒకచోట మంటలకు ఆహుతి అవుతూనే ఉన్నారు. అలాంటి వార్త లేకుండా ఏరోజూ దినపత్రిక రాదు. ఎటొచ్చీ అది వార్తగా చదివి ఒకటి రెండు క్షణాలు బాధపడి మరచిపోతాం... అదే ఆస్పత్రికొచ్చి అలాంటి కేసుల్ని ప్రత్యక్షంగా చూస్తే ఇప్పుడు కనకారావన్నట్టు జీవితం మీద విరక్తి కలగక మానదు. అందుకేనేమో ఆడపిల్లను కనాలంటే భయం... పెళ్ళి చెయ్యాలంటే భయం... పెళ్ళయ్యాక ఆ పిల్ల బతుకేమవుతుందోనన్న భయం... ఆడపిల్లల్ని కన్న మధ్యతరగతి తల్లిదండ్రులెందరో భయంతో బతుకులు వెళ్ళదీస్తున్నారంటే అతిశయోక్తి కాదు.

ఎక్కడి వరకో ఎందుకు..? పది రోజుల క్రితం చెల్లాయికి పదోసారి పెళ్ళిచూపుల కార్య

**చోడిశెట్టి శ్రీనివాసరావు**

క్రమం జరిగింది. తీరాచూస్తే అదీ కుదరనే లేదు. ఇంతకుముందొచ్చిన వాళ్ళ మాదిరిగానే వీళ్ళూ ఆరు అంకెల మీదనే పరుగు... పరుగో పరుగు... అసలు చెల్లాయికి పెళ్ళవుతుందా? భయంతో నా మనసును పట్టి మెలిపెడుతున్న ప్రశ్న ఇది. అయితే విచిత్రంగా - రిటైరై కూర్చున్న నాన్నకెలాంటి భయం ఉన్నట్టు కనబడదు. పైగా కల్యాణ ఘడియ రానంత సేపూ మనం ఎంత ప్రయత్నించినా ఇంతేరా... అంటారు. అమ్మ ఆయనకు వంత పాడుతూంటుంది. ఔనూ... ఆరు దాటిపోయిందే, అమ్మ ఇంకా రాలేదేమిటి? ఆ అమ్మాయికి ప్రసవమైనట్టా... మగపిల్లాడో... ఆడపిల్లో...

నా ఆలోచనల్ని చెదరగొడుతూ ఏవో కేకలు వినిపించడంతో చిన్నగా ఉలిక్కిపడి, ఆ దిశగా తలతిప్పి చూశాను. అక్కడికి సమీపంలో వున్న వేపచెట్టు కింద కొంతమంది జనం గుమిగూడి ఉన్నారు. ఆ గుంపులోంచే కేకలు వినబడుతున్నాయి. అక్కడేదో గొడవ జరుగుతున్నట్టుంది. ఏమిటా గొడవ?... ఉండబట్టలేక స్కూటర్ తాళం వేసి, గబగబా అక్కడి కెళ్ళాను.


గుంపు మధ్యలో ముతక ఖద్దరు పంచె, ఖద్దరు లాల్చీ వేసుకున్న వ్యక్తి - తెల్లచొక్కా, నల్ల ప్యాంటూ వేసుకున్న ఒకతని మీద కేకలేస్తున్నాడు. కేకలేస్తున్నాడనటం కన్నా తిడుతున్నాడంటేనే సమంజసంగా ఉంటుంది. తెల్లచొక్కా వ్యక్తికి ముప్పై అయిదేళ్ళు ఉండొచ్చు. చిరుద్యోగమేదో చేస్తున్నవాడిలానే ఉన్నాడు. ఖద్దరు లాల్చీవాలాకు ఇరవై ఎనిమిదేళ్ళ కన్నా మించి ఉండవు. అతని మాట తీరుని బట్టి పల్లెటూరు వాడని, చదువుకోనివాడనీ స్పష్టంగా తెలిసిపోతోంది.

"రేయ్, మళ్లీ ఆ మాటన్నవంటే నీ నాలుక సీలుత్తాను. నీ తల వంద ముక్కలు సేత్తాను... ఎంతీజీగా అనేసినావురా నాయలా... నీలాంటోల్లని... నీలాంటోల్లని..." అంటూనే ఖద్దరు లాల్చీవాలా గభాలున రెండడుగులు ముందుకేసి అక్కడున్న వాళ్ళెవరూ ఊహించని విధంగా తెల్లచొక్కా వ్యక్తి చెంప చెళ్ళుమనిపించాడు... మళ్ళీ మరోసారి కొట్టబోయేంతలో అంత వరకూ ఏదో వినోదం చూస్తున్నట్టు నిలబడ్డ జనంలో చైతన్యం వచ్చి చటుక్కున అతణ్ణి పట్టుకొని వెనక్కి లాగారు.

"అరె... నీ బంధువే అంటున్నావు కదా.... ఇక "ఊరుకోవయ్యా బాబూ ఊరుకో!" అన్నాడు గుంపులో వున్న ఓ పెద్దాయన లాల్చీవాలాను మందలిస్తూ.

"వూరుకోమంటారేటండీ... ఇలాంటెదవల్ని కుల్లబొడిసెయ్యాల... ఈల్ల మొగాలు సూత్తేనే పాపం సుట్టుకుంటాది..." లాల్చీవాలా ముఖం కందగడ్డలా అయిపోయింది. తనను పట్టుకున్న వాళ్ళు గనక ఏమాత్రం పట్టు సడలించినా అమాంతం ఆ తెల్లచొక్కా వ్యక్తి మీద పడి గొంతు నులిమేసేలా ఉన్నాడు. వీడెవడో పరమ మూర్ఖుడో, రౌడీనో అయి ఉంటాడు. లేకపోతే ఆస్పత్రిలో గొడవకు సిద్ధపడతాడా... అందులోనూ ఇంతమంది ఉండగా ఒక మనిషిని కొట్టడం కూడానా... ఎంత ధైర్యం... ఎంత దారుణం అనుకున్నాను మనసులో.

దెబ్బతిన్న తెల్లచొక్కా వ్యక్తి చెంప సవరించుకుంటూ ఖద్దరు లాల్చీవాలాను మిర్రున చూస్తున్నాడు. వాళ్ళిద్దరూ అక్కడే ఉంటే కొట్టుకు చస్తారనుకున్నాడో ఏమో మళ్ళీ పెద్దాయన కలగజేసుకొని "చూడండీ... ఇక్కడ గొడవపడ్డం సబబు కాదు. మీరు ఇలాగే గొడవపడుతూంటే పోలీసులొస్తారు. అక్కడ నుంచి లేవి




పోని తతంగం మొదలవుతుంది. వెళ్ళిపోండి." అని తెల్లచొక్కా వ్యక్తి భుజం తట్టి బుజ్జగించి, మెల్లగా అక్కడ నుంచి పంపించేసాడు.

అతను వెళ్ళిపోయినా ఖద్దరు లాల్చీవాలా ఆవేశపడుతూనే ఉన్నాడు. అందుకు నిదర్శనంగా అతని ముక్కుపుటాలింకా అదురుతూనే ఉన్నయ్.

"అసలేమిటండీ గొడవ?" అప్రయత్నంగా పెద్దాయన్ని అడిగాను.

"ఏం చెప్పమంటారు? వీళ్ళ గొడవ చాలా చిత్రంగా ఉంది... ఇతని భార్యకు నిన్న ఈ ఆసుపత్రిలో 'సిజేరియన్' చేసి బిడ్డను బయటకు తీసారట. ఇప్పుడు వెళ్ళిపోయిన తెల్ల చొక్కా వ్యక్తి ఇతగాడి బంధువట. విషయం తెలిసి చూసి పోదామని వచ్చాడు. వచ్చినవాడు లోపలికెళ్ళి తల్లీ బిడ్డల్ని చూడకుండా తిన్నగా చెట్టుకింద కూర్చున్న ఇతని వద్దకొచ్చి పళ్ళికిలిస్తూ 'ఆడపిల్లంట కదరా... అయిపోయినట్టే ఇక నీ పని!... ఆరోజు ఆడోమగో తెలుసుకుందామంటే డబ్బు కోసం మొహం చూసుకొని నామాట విన్నావు కాదు.' అన్నాడట హేళనగా. అంతే ఇతను ప్రళయకాలరుద్రుడై పోయాడు... ఆ తర్వాతేం జరిగిందో మీరూ చూశారుగా...

"ఏమైనా ఆడపిల్ల అనేసరికి బాగా చులకనై పోయిందిలెండి! మీరెప్పుడైనా గమనించారో లేదో, ఇప్పుడు చాలామంది... మంచి చెడ్డలు ఆలోచించగల మెదడున్నవాళ్ళూ, మస్తుగా డబ్బున్న వాళ్ళూ కూడా ఆడపిల్ల పుట్టిందనగానే 'అయ్యో ఆడపిల్లా!' అంటున్నారు. అదేదో మహాపరాధం అయినట్టూ, వినకూడని మాట విన్నట్టూను. ఒక పక్క ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతోందని పత్రికలు, ప్రసార సాధనాలూ పని గట్టుకు చెబుతున్నా ఎవరూ లెక్కచేయడం లేదు. చట్టాన్ని లక్ష్యపెట్టకుండా కొందరేమో ఆడశిశువుల్ని వెలుగు చూడకుండా చేసేస్తున్నారు. అసలు ఆడది లేకుంటే సృష్టే లేదన్న కఠోర సత్యాన్ని మరచిపోతున్నారేమిటండీ బాబా

మాయదారి మనుషులు!!...” చిన్న ఉపన్యాసం లా చెప్పి పెద్దగా నిట్టూర్చాడు పెద్దాయన.

“బావూ... మీరు సానా సదూకున్నోరిలా అగుపడతన్నారు. నా ఒంట్లో సత్తువుంది... కట్టం చేసి నాపిల్లను పెంచుకొని ఒకయ్య సేతిలో పెట్టగలననే దయిర్యముంది. నాకాడ కూతురైతే ఆడికేటి బాధ? ఒకమ్మకి పుట్టిన ఎదవ... పుత్తెకట్టి ఒకాడ మనిషితో కాపరం మండబెడతన్న మాదచ్చాద్. అలా అంటం తప్పా గాదా?” తవరు సెప్పండి బావూ! హఠాత్తుగా ఖద్దరు లాల్చీవాలా అడిగాడు నన్ను.

అతని మాటల్లో అవ్యక్తమైన బాధ ఉంది. స్త్రీ పట్ల అపారమైన గౌరవభావం ఉంది. తనకు పుట్టింది ఆడపిల్లయినా బతికించుకొని ఆమె జీవితానికొక దారి చూపగలననే ఆత్మవిశ్వాసం ఉంది. అతనో మూర్ఖుడనీ, రౌడీ అనీ అంచనా వేసుకున్నందుకు నొచ్చుకున్నాను... నన్ను నేనే తిట్టుకున్నాను.

నిజంగా అతడన్నట్టు నేను బాగా చదువుకున్న వాణ్ణీ, నెలకు ఎనిమిది వేలు ఆదాయం తెచ్చుకుంటున్న వాణ్ణీ, ఏదీ తప్పో, ఏదీ ఒప్పో చెప్పగలిగిన వాణ్ణీనూ. అయినా అతను అడిగిన దానికి జవాబు చెప్పలేక వచ్చీరాని నవ్వుతో వాళ్ళకు వీడ్కోలు చెప్పి ఎవరో తరుముతున్నట్టు నడిచి, స్కూటరు వద్ద కొచ్చాను.


“ఏమైందిరా చెట్టుకింద అంతమంది ఉన్నారు?” అప్పటికే వచ్చి నాకోసం ఎదురుచూస్తున్న అమ్మ అడిగింది.

అక్కడ జరిగిన గొడవ గురించి అమ్మకు చెప్పి, “ఆ అమ్మాయికెలా ఉంది?” అన్నాను.

“ఆడపిల్ల పుట్టిందిరా. పిల్ల బలహీనంగా



రచయిత, కార్టూనిస్ట్ భువన్ కథాసంకలనం ‘ఈ కథలూ – ఆ కథలూ’ ని ఆవిష్కరించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ మంత్రి శ్రీ కొణతాల రామకృష్ణ. సినీనటులు కత్తి చిదంబరం, కాశీవిశ్వనాథ్, విజయప్రసాద్, రచయిత భువన్, ఎమ్మెల్యే గండి బాబ్జి, కొణతాల లక్ష్మీనారాయణ, రఘునాథ్, ఎఫ్.ఎమ్. బాబాయ్, లాఫింగ్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.




వున్నా బావుంది... నీ కూతురైతే ఎర్రగా, బొద్దుగా ఇంకా బాగుంటుంది! నువ్వు ఇంతవరకూ ఆ తల్లీ పిల్లల ముఖాలు చూసావు కాదు! కారణమేమిటో తెలియకుండా ఉంది!?" అంది కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ అమ్మ.

అమ్మను ఇంకా బాధ పెట్టడం భావ్యం కాదనిపించింది... "అదేనమ్మా... అప్పట్లో ఆడో మగో తెలుసుకొని – ఆడపిల్లయితే 'అబార్షన్' చేయించుకుందువుగానంటే కమల ఎంతకీ ఒప్పుకోలేదు. పైగా తనకు మగపిల్లాడే పుడతాడని ధీమాగా చెప్పి ఆడపిల్లకు జన్మ నిచ్చింది. ఆ వార్త తెలియగానే నన్నావహించిన భయం, నా మాట వినలేదన్న కోపం ఇంతవరకూ తనను చూడకుండా చేసాయి..." అంటూ ఉన్న విషయం చెప్పాను.

"ఏమిటీ... నువ్వు కమలను చూడ్డానికెళ్ళక పోవడానికి గల కారణం ఆడపిల్ల పుట్టిందనా? ఆడపిల్లంటే నీకు భయమా!?... ఎంత చిత్రంగా ఉందిరా? ఆడపిల్ల వద్దనుకోవడం ఎంత తప్పో – అందువల్ల ముంచుకొస్తున్న ముప్పే మిటో తెలిసి కూడా ఇంత మూర్ఖంగా ప్రవర్తిస్తున్నావా!?" ఆశ్చర్యం, ఆవేదనా కలగలిసిన కంఠంతో అంది అమ్మ.

"చాలా తప్పు చేసానమ్మా! కాయకష్టం చేసుకొని బతికేవాడికుండేపాటి ధైర్యం నాకు లేకపోయింది. జ్ఞానముండీ అజ్ఞానిలా ప్రవర్తించాను. పాపం కమల ఎంత బాధపడుతోందో?... రేపే తనను చూడ్డానికెళతాను. వీలును బట్టి కమలను నాతో తీసుకొచ్చేస్తానమ్మా!" అన్నాను.

అమ్మ కొన్ని క్షణాలపాటు పట్టిపట్టి నా ముఖంలోకి చూసి, "ఇక్కడ అనుకోకుండా జరిగిన గొడవ మీ గొడవను పరిష్కరించిందన్న మాట! పోన్లే... ఇప్పటికైనా నీ తప్పు తెలుసుకున్నావు" అంటూ ఆనందంగా స్కూటరెక్కి కూర్చొంది.

తేలికపడ్డ మనసుతో హుషారుగా స్కూటర్ని ముందుకు పరిగెత్తించాను. ●